నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి తెలిపారు. ఉద్యోగస్తులైన తల్లిదండ్రులు తమ పిల్లలకు తల్లిపాలను కొనసాగించేలాగా సహకరించాలి' అంటూ ఆరోగ్య కేంద్రాలు, పని ప్రదేశాల్లో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే తల్లిపాల విశిష్టతను అందరికీ తెలియజేస్తామన్నారు. బిడ్డలకు తల్లిపాలివ్వడంలో మన దేశం 79వ స్థానంలో ఉందన్నారు. అమలులో వందకి 45 మార్కులతో వెనుకబడి ఉందని 2018లో జరిగిన సర్వేలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖతో పాటు వైద్యశాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్ గ్రామ వార్డు సచివాలయాలు, ఎన్‌జిఒలు కలిసికట్టుగా విస్తృత ప్రచారం చేపట్టాలని కోరారు.

ఉత్సాహంగా విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర

- పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం
- సైకిల్‌యాత్ర ప్రారంభంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు
- ఎన్ఇపిని రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

సైకిల్‌యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-కొత్తవలస

జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నాయకులు చేపట్టిన 'విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర' సోమవారం కొత్తవలసలో ఉత్సాహంగా ప్రారంభమైంది. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు జెండా ఊపి ఈ సైకిల్‌యాత్రను రెవెన్యూ కార్యాలయం జంక్షన్ వద్ద ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి అంబేద్కర్‌జంక్షన్‌కు చేరుకుంది. సైకిల్‌యాత్రకు విద్యార్థులు అడుగడుగునా స్వాగతం పలికారు. కొత్తవలసనుంచి ప్రారంభమైన యాత్ర లక్కవరపుకోట మీదుగా ఎస్.కోట చేరుకుంది. సైకిల్ యాత్ర ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక పక్క పాఠశాలలను మూసివేస్తూ ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేస్తున్నారని, సంక్షేమ హాస్టళ్లలో పూర్తిగా విద్యార్థులకు మౌలిక సదుపాయలు లేక, మెస్ ఛార్జీలు పెరగక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కెజిబివిల్లో ఇప్పటికీ సరిగ్గా టీచర్లు లేరని అన్నారు. విద్యార్థులు పోరాటాల ద్వారానే తమ సమస్యలు పరిష్కారం చేసుకోవాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తమ సొంత జిల్లాలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని అన్నారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నేటి వరకు అందించలేదని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు సరైన బిల్డింగులు లేవన్నారు. జీవో 77 తీసుకొచ్చి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేశారన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని అభివృద్ధి చెయ్యాలని కోరారు. ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ రావు మాట్లాడుతూ జిల్లాలో మూత పడిన పరిశ్రమలు తెరిపించడంలోను, కొత్తవి స్థాపించడంలోను, ఉపాధి కల్పించడంలోను పాలకులు విఫలమయ్యారని అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించా లని జిల్లా వ్యాప్తంగా 400 కిలోమీటర్లు సైకిల్‌యాత్ర చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అప్పటికీ పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, నాయకులు హర్ష తదితరులు పాల్గొన్నారు. సైకిల్‌యాత్రకు సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు మద్దతు తెలిపారు. అనంతరం కొత్తవలసలోని కెజిబివి పాఠశాలను ఎమ్మెల్సీ సందర్శించారు. టీచర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

లక్కవరపుకోట : మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. లక్కవరపుకోట చేరుకున్న సైకిల్‌యాత్ర తొలుత ఎపి మోడల్ స్కూల్‌ను నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకుని రెండు నెలలు కావస్తున్న నేటికీ చాలామందికి పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఆర్భాటంగా చెప్పుకుంటున్న అమ్మబడి పథకం ద్వారా ఇవ్వవలసిన డబ్బులు అనేకమంది తల్లులకు అందలేదన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలన్నారు.


ఎస్.కోట వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేడు ఎస్. కోటలో బహిరంగ సభ

శృంగవరపుకోట : పట్టణంలో మంగళవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ తెలిపారు. ఎస్.కోటకు చేరుకున్న సైకిల్ యాత్రకు ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. దేవి కూడలిలో విద్యార్థులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఉదయం 10 గంటలకు దేవి బొమ్మ కూడలిలో జరిగే బహిరంగ సభకు విద్యార్థులు తరలిరావాలని రామ్మోహన్ కోరారు.

హాస్టల్‌కు తాళాలు వేయడంతో లోపల నుంచి చూస్తున్న విద్యార్థులు

ఎపి పురం హాస్టల్లో దారుణం

- వార్డెన్‌తో సహా సిబ్బంది రాత్రిపూట ఇళ్లకు..
- విద్యార్థులను లోపల ఉంచి తాళాలు
- అవసరమైతే గ్రామస్తులకు ఫోన్ చెయ్యండని హుకుం

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలం అంబాడ వెంకటాపురం బిసి బాలుర వసతి గృహంలో దారుణం చోటు చేసుకుంటోంది. ఇక్కడ మూడవ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రతిరోజు రాత్రి పూట వసతి గృహంలో విద్యార్థులను ఉంచి సిబ్బంది హాస్టల్‌కు తాళాలు వేసి వారి ఇళ్లకు వెళ్లి తెల్లవారి వస్తూ ఉంటారు. ఆదివారం రాత్రి ఈ విషయం వెలుగులోకి వచ్చింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా గ్రామస్తులకు ఫోన్ చేసి చెప్పాలని వివరించారు. రోజూ వసతి గృహ ఉద్యోగులు ఇలా వారి ఇళ్లకు వెళు తున్న విషయాన్ని ప్రశ్నిస్తే దండన చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ పూర్తిస్థాయి వార్డెన్ లేకపోవడంతో వంగర మండలం సీతారాంపురం లో పనిచేస్తున్న వార్డెన్ సూర్యారావును డిప్యూటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్నారు. ఆయన ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు రారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా సిబ్బంది రాత్రిపూట ఇళ్లకు వెళ్లిపోతూ హాస్టల్‌కు తాళాలు వేస్తున్నారు. ఎవరికైనా ఈ విషయం చెబితే హాస్టల్ నుంచి తీసేస్తామని బెదిరిస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. ఏ హాస్టల్లో లేని విధంగా ఇక్కడ హాస్టల్లో వార్డెన్, సిబ్బంది వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఇలా అయితే చదువులు మధ్యలో వదిలేసి తమ ఇళ్లకు వెళ్లి పోతామని చెబుతున్నారు. ఉన్నత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

సైన్సు,చరిత్ర పాఠాలను యథాతథంగా కొనసాగించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్

విజయనగరం టౌన్: చరిత్ర, సైన్సు పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం జెడ్‌పి మినిస్టీరియల్ 'సైన్స్-చరిత్ర పాఠ్యాంశాలు సిలబస్ నుండి తొలగింపు' అనే అంశం మీద రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంఘాల నుండి నాయకులు పాల్గొన్నారు. చరిత్ర, సైన్సు పాఠ్యాంశాల తొలగింపు అప్రజాస్వామికంగా, మత విద్వేషాలను రెచ్చగొట్టేటట్టుగా ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. సైన్సు చరిత్ర పాఠాలను తిరిగి యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెవిఎఆర్‌కె ఈశ్వరరావు, యుటిఎఫ్ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ కె శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు సతీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు హరీష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సిహెచ్ తిరుపతి నాయుడు, జి రాజారావులు పాల్గొన్నారు.

ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమల పరిరక్షణకు...

నేడు రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలోని ఒడిదొడుకుల మధ్య నడుస్తున్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను నిలబెట్టుకునేందుకు వాటిలో పనిచేస్తున్న కార్మికులు సన్నద్ధమౌతున్నారు. వీరందర్నీ ఐక్యం చేసిన సిఐటియు విజయనగరంలోని రెవెన్యూ కల్యాణమండపం వేదికగా మంగళవారం రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తోంది. ఈ సదస్సుకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ హాజరు కానున్నారు. అన్ని ఫెర్రోఎల్లాయిస్ కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొంటారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీల పెంపుకారణంగా పరిశ్రమలు కుదేలవుతున్న విషయం విధితమే. ఇటీవల పెంచిన ఛార్జీలతో పరిశ్రమలు నడపలేకపోతున్నామంటూ ఇప్పటికే పరిశ్రమల యాజమానులు ప్రభుత్వానికి తెలియజేశారు. మూసివేస్తామని కూడా చెప్పారు. ఇదే పరిస్థితి ఏర్పడితే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30వేల మంది కార్మికులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కోల్పోతారు. ఈనేపథ్యంలో విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని, పరిశ్రమల మనుగడకు తగిన ప్రోత్సాహం కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ సదస్సులో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నారు.

మణిపూర్ హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-సాలూరు

మణిపూర్ రాష్ట్రంలో హింసకు వ్యతిరేకంగా ఆదివారం పట్టణ ఫెలోషిప్ ఫాస్టర్స్ ఆధ్వర్యాన క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. మూడు నెలలుగా మణిపూర్‌లో దారుణమైన హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బోసుబొమ్మ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు, ఫాస్టర్ సువార్తరావు, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి . సుధారాణి మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు నిత్యం పెరుగడం వల్ల పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడం కార్మికులకు కష్టంగా ఉందన్నారు. బిల్లులు కూడా ఎప్పటివి అప్పుడు ఇవ్వకపోవడంతో పథకం నిర్వాహణ భారం అవుతోందన్నారు. వీటికితోడు 2019లో నిర్ణయించిన గౌరవవేతనాలనే నేటికీ అమలు చేయడం వలన కుటుంబాలకు గడవటం కష్టంగా ఉందన్నారు. వర్కర్లకు కనీసవేతనం రూ.10వేలు ఇవ్వాలని, ధరలు పెరుగుదలకు అనుగుణంగా మెనూఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బకాయి ఉన్న బిల్లులు, జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. బిల్లులు వేతనాలు ప్రతినెలా 5వ తేదిలోపుగా చెల్లించాలని, ఒక నెల మెనూఛార్జీలను అడ్వాన్స్ ఇవ్వాలని, నాణ్యమైన బియ్యం, సరుకులు సివిల్ సప్లయి శాఖ ద్వారా పాఠశాలలకు అందించాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ధర్నా లో జిల్లా అధ్యక్షులు వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో వెల్లువెత్తిన వినతులు

సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజల నుంచి వినతులు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గ్రీవెన్స్ విభాగానికి 407 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ట్రైనీ కలెక్టర్ వెంకట్ సహాదిత్‌నాగ్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలత, సుదర్శన దొర, సూర్యనారాయణ తదితరులు వినతులు స్వీకరించి ఆయా వినతుల పరిష్కారంకోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఉదయం 11 గంటల నుంచి 2.30 గంటల వరకు జిల్లా అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రాష్ట్ర ఒబిసి కార్పొరేషన్ ఛైర్మన్ పెంద్ర వీరన్న, కలెక్టర్‌ను కలసి ఒబిసిల సమస్యలపై వినతి అందించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి ప్రయత్నిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరించిందని పేర్కొంటూ ఆర్మీ అధికారులు గురుచరణ్ సింగ్ రణ్‌ధావా, వినయ్ కుమార్‌లు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఆరోగ్యమిత్ర అవార్డు బహూకరణ

ఉత్తమ ఆరోగ్యమిత్రగా ఎంపికైన మెట్ట సూర్యకుమారికి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి రూ.5000 నగదు బహూమతి, ప్రశంసాపత్రం అందజేశారు. గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో ఆరోగ్యమిత్రగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ యు.అప్పలరాజు పాల్గొన్నారు.

మంచి పనితీరు కనబరచిన వారికే ప్రశంసాపత్రాలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, కార్యక్రమాల అమలులో మంచి ప్రతిభ కనబరచి నిర్దేశిత లక్ష్యాలు సాధించిన వారికే ప్రశంసాపత్రాల కోసం సిఫారసు చేయాలని జిల్లా నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. గతంలో ప్రశంసాపత్రాలు అందుకున్న వారిని మళ్లీ ఈ ఏడాది కూడా సిఫారసు చేయవద్దని పేర్కొన్నారు. ఒక్కో ప్రభుత్వ శాఖ నుంచి ముగ్గురికి మించకుండా ఆగష్టు 5వ తేదీలోగా అన్ని ప్రభుత్వ శాఖలు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆగష్టు 15న స్వాతంత్ర్య వేడుకలు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. 15 ప్రభుత్వ శాఖలు తమ అభివృద్ధి కార్యక్రమాలను తెలుపుతూ శకటాలను ప్రదర్శించాలని ఆదేశించారు. వేడుకలు ముగిసిన అనంతరం నగరంలోని ముఖ్యమైన మార్గాల్లో ప్రభుత్వ శకటాల ప్రదర్శన నిర్వహించాలన్నారు. డిఆర్ఒ ఎం.గణపతిరావు, ట్రైనీ కలెక్టర్ బి.వెంకట్ సహాదిత్ నాగ్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు సూర్యనారాయణ, పద్మలత, బి.సుదర్శనదొర పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

స్కూల్ స్వీపర్లకు 10వేలు వేతనమివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలని, బకాయి జాతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియుజిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ ఆయాలకు నెలకు ఆరువేల గౌరవ వేతనం ఇస్తున్నారని, పార్ట్‌టైం వర్కర్లని చెబుతూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పాఠశాలల్లో ఉంచుతున్నారని అన్నారు. కష్టం వస్తే పూట, రోజు అనుమతి కోరినా ప్రధానోపాధ్యాయులు అనుమతి ఇవ్వటం లేదన్నారు. గతంలో పని చేసిన దానికి 3 నెలల నుంచి 12 నెలలు వరకూ జీతాలు బకాయిలు ఉన్నాయన్నారు. అడిగితే స్కూలు కమిటీలు జోక్యం చేసుకొని తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ కమిటీల పెత్తనం ఆపాలని డిమాండ్ చేశారు. నెలలో 2 సిక్ లీవులు మంజూరు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో స్వీపర్లు ఎం.ఆదిలక్ష్మి, ఎస్.లత, నందిని, అభిజా బేగం, పైడిరాజు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వాడీవేడిగా చర్చ

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ ప్రజా సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సోమవారం కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రమాదేవి మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలు ఉన్న తొలగించని అధికారులు తమ వార్డులో సమాచారం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. ఆక్రమణలు తొలగించిన అధికారులు వ్యర్ధాలను తరలించకుండా అక్కడే విడిచిపెట్టడంతో సొంత డబ్బులతో తరలించాల్సి వచ్చిందన్నారు. ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ ఇంటి గోవిందరావు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ ఆక్రమణలలో చైర్మన్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ స్పందిస్తూ ఆక్రమణలతో తనకు సంబంధం లేదని ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. గొల్లపల్లి చెరువు సుందరీకరణకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.5లక్షలు కేటాయిస్తూ తీర్మానం పెట్టగా కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. వైసిపి కౌన్సిలర్ బొత్స రమణమ్మ మాట్లాడుతూ మున్సిపల్ ఎలక్ట్రికల్ ఉద్యోగులు తమ మాట వినడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలక్ట్రికల్ సిబ్బందిని మార్చాలని కోరారు. కౌన్సిలర్ ఇంటి గోవిందరావు మాట్లాడుతూ గొల్లపల్లి చెరువు సుందరీకరణకు నిధులు కేటాయించిన అధికారులు మల్లమ్మపేట రోడ్లుకు ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. రోడ్లుకు నిధులు కేటాయించాలని, కుళాయిలకు పన్ను వేయాలని డిమాండ్ చేశారు. టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ పూల్ బాగ్ రహదారి మరమ్మతులకు మున్సిపల్ సాధారణ నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, వైస్ ఛైర్మన్ చెలికాని మురళి స్పందిస్తూ పూల్ బాగ్ రహదారికి ప్రభుత్వ నిధులు కోసం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రతిపాదనలు చేశారని, ప్రభుత్వం నిధులు మంజూ రు చేయడంలో జాప్యం జరగనుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా రూ.40లక్షలతో మరమ్మతు పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని డిమాండ్

సమావేశంలో సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

దొంగ సర్టిఫికెట్లతో స్థలాలను అమ్మేస్తున్నారు

ఎస్‌పి గ్రీవెన్సు బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయనగరం

తమ స్థలాన్ని దొంగ సర్టిఫికెట్లతో వేరొకరికి అమ్మేస్తూ తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు బాధితులు ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎస్‌పికి సమస్యను వివరిస్తున్న బాధితులు

విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌కు ఆనుకొని ఉన్న రైల్వే ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ 64/1లోని తమ స్థలాలను తప్పుడు ధ్రువపత్రాలతో దత్తిరాజేరు మండలం ఇంగిలాపల్లికి చెందిన నిష్టల వెంకట సన్యాసిరావు తదితరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఒడిశాలోని టిట్లాఘర్‌కు చెందిన రిటైర్డ్ తహశీల్దార్ డి.హరిహరరావు, కె.త్రినాధరావు ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. సన్యాసిరావు స్థానిక తహశీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి, తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలతో లే అవుట్ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఎస్‌పి స్పందిస్తూ తక్షణమే కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని రూరల్ సిఐ తిరుపతిరావును ఆదేశించారు. గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేస్తూ ..నగరానికి చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.22లక్షలకు ప్లాట్ కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని, రూ.5 లక్షలు అడ్వాన్సుగా చెల్లించామని, కానీ ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం చేస్తున్నారని తెలిపారు. ఇలా పలువురు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె. మురళి, ఎస్‌బి సిఐలు కె.కె. వి. విజయనాథ్, ఈ. నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే

రేగిడి: మండలంలోని 25 సచివాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అన్ని శాఖాధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో ప్రగతి కనిపించాలన్నారు. ఈ సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భవనాల నిర్మాణాలు చురుగ్గా సాగాలన్నారు. మండలంలో ఐదు సచివాలయ భవనాలు పూర్తిచేసి పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో 10 పూర్తయ్యే దశలో ఉన్నాయని అధికారులు చెప్పారు. వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ నాగమణి, తహశీల్దార్ టి. కల్యాణచక్రవర్తి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పేదోళ్ల గూడు కూలిస్తే ఉద్యమిస్తాం

రామభద్రపురం: కొన్ని దశాబ్దాల కాలంగా రహదారి పక్కనే నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న పేదోళ్ల గూడు కూలిస్తే ఉద్యమిస్తామని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు సుధాకర్ హెచ్చరించారు. సోమవారం 26వ జాతీయ రహదారిపై రోడ్డు పక్కనే నివాసం ఉంటున్న పేదల ఆందోళనకు దిగి కొద్ది సేపు రహదారి స్తంభింపజేశారు. వీరికి సంఘీభావంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. రహదారి విస్తరణలో భాగంగా పేదలు నివాసాలను అధికార యంత్రాంగం తొలగిస్తున్న నేపథ్యంలో పేదలు ఆందోళనకు దిగారని ఆయన చెప్పారు. పేదల నివాసాలు వెనుక ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి మామిడి తోటకు రహదారి పేరిట సుమారు 8 నివాస సముదాయాలు తొలగించాలని హుకుం జారీ చేసి సంబంధిత అధికారులతో తొలగింపు చర్యలకు సిద్ధమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టాపు శ్రీనివాసరావు, బర్ల మీనాక్షి, యజ్జల సింహాచలం, కిల్లాడ రామకృష్ణ, రాజు, చంటి, పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

రేగిడి: మండలంలోని జోడు బందల గ్రామంలో సోమవారం వేకువ జామున సవిరిగాన దాలమ్మ, శ్రీనివాసరావులకు చెందిన ఇంటి గోడ కూలి పెను ప్రమాదం తప్పింది. ఇటీవల పడిన వర్షాలకు గోడ తడిచి కూలింది. గోడ కూలిన సమయంలో ఇంట్లో ఉండేవారు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ప్రాణహాని తప్పింది. రాత్రి సమయంలో జరిగితే ఆ ఇంటిలో ఉన్న నాలుగు ప్రాణాలకు ప్రమాదం వాటిల్లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పగలు కూలడం పైగా ఎవరు లేకపోవడంతో ప్రాణాలు కాపాడుకోగలిగామని ఇంటిలో సామాగ్రి అంతా ధ్వంసం అయ్యాయని ఇల్లు మంజూరు చేయాలని వారు కోరారు.

విత్తనాలు పంపిణీ

డెంకాడ : ప్రకృతి వ్యవసాయ విత్తనాలను ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రకాల ప్రకృతి వ్యవసాయ విత్తనాలతో పాటు వ్యవసాయానికి పనికి వచ్చే ఉపకారణాలను ఉచితంగా రైతులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా అందిస్తున్నామన్నారు. మండలంలో 19 మంది ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు 11 రకాలు విత్తనాలు పనిముట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, ఎస్‌సి కార్పొరేషన్ సహాయ కార్యనిర్వాహక అధికారి కేవిఎన్ ప్రభాకర్ రావు, ఎస్‌సి కార్పొరేషన్ సీనియర్ అధికారి సత్యనారాయణ, ఎఒ నిర్మల, చొల్లంగిపేట సర్పంచ్ కోరాడ కనకరాజు, బంటుపల్లి సర్పంచ్ చిక్కాల జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

'జంపా' మృతి తీరనిలోటు

మెంటాడ: జన విజ్ఞానవేదిక జాతీయ నాయకులుగా 30ఏళ్లు సుదీర్ఘ కాలం సేవలందించిన జంపా కృష్ణ కిషోర్ మృతి తీరని లోటని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు గండ్రేటి అప్పలనాయుడు సోమవారం సంతాపం తెలిపారు. ఆయన మరణాంతరం తన శరీరాన్ని వైద్య విద్యార్థుల కోసం దానం చేశారని గుర్తు చేశారు. ఆయనకు సంతాపం తెలిపిన వారిలో జి. లక్ష్మణరావు, రెడ్డి రాజగోపాల్, సిపిఎం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు తదితరులున్నారు.

ఇళ్ల బిల్లులు మంజూరు చేయండి

పూసపాటిరేగ: మండలంలో నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని టిఎన్‌ఎస్‌ఎఫ్ విజయనగరం పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కొత్తకోట బాలకృష్ణ సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూసపాటిరేగ మండలం గుంపాం గ్రామంలో 2016-19 మధ్యలో ఎన్‌టిఆర్, పిఎంఎవై గృహ నిర్మాణ ఆవాస్ యోజనలో భాగంగా 40 మంది గృహ నిర్మాణాలు చేసుకున్నారని అప్పట్లో సగం బిల్లులు మంజూరయ్యాయని మిగిలిన బిల్లులు రాలేదని చెప్పారు. ఈ ప్రభుత్వంలో మిగిలిన బిల్లులు ఇవ్వాలని కోరుతూ భాదితలతో కలిసి కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయాన్ని చాలా సార్లు వాలంటీర్లకు, సచివాలయం సిబ్బందికి, గృహ నిర్మాణ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందనా లేదన్నారు. వినతి ఇచ్చిన వారిలో మహంతి శ్రీను, గొల్లపూడి రమేష్, కొత్తకోట పాపునాయుడు, రెల్లివలస 10వ వార్డు మెంబరు చింతపల్లి శ్రీను తదితర భాదితులు ఉన్నారు.

నాగార్జునవి అవగాహన లేని మాటలు

గరివిడి : టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జునవి అవగాహన లేని మాటలని చీపురపల్లి వైసిపి నాయకులు ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. చీపురుపల్లి వైసిపి కార్యాలయంలో సోమవారం ఉదయం వారు విలేకర్లతో మాట్లాడారు. చీపురుపల్లి అభివృద్ధి గురించి నాగార్జునకు తెలియకపోవచ్చు కానీ ఆయన పెదనాన్న కిమిడి కళావెంకట్రావు, ఆయన తల్లి కిమిడి మృణాళినికి తెలుసని వారిని ఒకసారి అడిగి తెలుసుకోవాలని హితవుపలికారు. మంత్రి బొత్స సత్యనారాయణ 2014లో గవర్నమెంట్ హాస్పిటల్ రూ.4.50కోట్లతో 30 పడకల ఆసుపత్రికి మంజూరు చేసి శంకుస్థాపన చేశారన్నారు. నిధులు కూడా అప్పుడే మంజూరయ్యాయని టిడిపి టైంలో బిల్డింగ్ కట్టడం మాత్రమే జరిగిందని చెప్పారు. ఆదర్శ డిగ్రీ కళాశాల కూడా 2014లో రూ.9 కోట్లతో మంజూరు చేసి గ్రాంట్ రిలీజ్ చేయడం జరిగిందని మీ టైంలో ఏం అభివృద్ధి జరగలేదని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టౌన్ పార్టీ ప్రెసిడెంట్ పతివాడ రాజారావు, మండల కో-ఆర్డినేటర్ సువ్వాడ అప్పలనాయుడు, గొల్లపాలెం సర్పంచ్ గొర్లె శ్రీరాములునాయుడు, రామలింగాపురం పిఎసిఎస్ అధ్యక్షులు పనస అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలియజేయండి

బొబ్బిలి: మాజీ సైనికులకు సమస్యలుంటే తమకు తెలియజేయాలని వీర బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రెడ్డి దామోదర్ అన్నారు. బొబ్బిలిలో సోమవారం మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న చేపట్ట బోయే స్వతంత్ర దినోత్సవం కార్యక్రమం నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఎవరికైనా సమస్యలుంటే జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కృష్ణారావుతో మాట్లాడి సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు మరడ అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఎ.నాయుడు, సెక్రెటరీ వి.ఎన్.శర్మ, ట్రెజరర్ గెంబలి శ్రీను, మాజీ సైనికులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని పలు పెట్రోలు బంకులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోలు బంకుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని యాజమాన్యంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ బి. సింహాచలం (శ్రీకాకుళం) మండిపడ్డారు. కొత్తవలస వాసవి హెచ్‌పిసిఎల్ పెట్రోలు బంకులో క్వాలిటీ, క్వాంటిటీ, స్టాక్‌లో తేడాలను పరిశీలించారు. లేబర్ మెంటైనెన్స్ రికార్డులు లేవని, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ లేదనీ వాహనాలకు ఉచితంగా గాలి సదుపాయం కల్పించడం లేదని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో లేబర్ డిపార్టు మెంటు విజయనగరం అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ పీవీ. రంగారెడ్డి, విశాఖపట్నం హెచ్‌పిసిఎల్ మొబైల్ ల్యాబ్ మేనేజర్ ఎన్‌టివిఎస్ మూర్తి, కొత్తవలస సిఎస్‌డిటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

40 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని చిన బూరాడ పేటలో మాజీ సర్పంచ్ నడిపల్లి రాము నాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన అల్లుడు తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు మిమ్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు 40మందికి తనిఖీలు చేసి 12మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన వారికి మిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఈ శిబిరంలో మిమ్స్ వైద్యులు డాక్టర్ ఆర్. అపూర్వ, నిసార్ అహ్మద్, ఇందుకూరి నవీన్ వర్మ, ఎంపిటిసి సంగం రెడ్డి జగన్నాథం, నాయకులు బెల్లాన రామారావు, మక్కువ రమణ, కోట్ల సత్యా రావు, ఎల్.జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

సం'క్షోభ' హాస్టల్

- శిథిలావస్థకు చేరిన వసతి గృహం
- విద్యార్థులకు కనీస వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు

శిథిలమైన సోలార్ వాటర్ హీటర్

ప్రజాశక్తి - శృంగవరపుకోట

విద్యాభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని నాడు నేడు ద్వారా పాఠశాలలు, వసతి గృహాలు అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ ప్రభుత్వ వసతి గృహాల్లో అటువంటి సౌకర్యాలు కానరావడం లేదు. అసౌకర్యాల నడుమ వసతి గృహాల విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమనే చెప్పాలి..

మండలంలోని అతిపెద్ద మేజర్ పంచాయితీ అయిన ధర్మవరం గ్రామంలో వెనుకబడిన తరగతుల ప్రీ మెట్రిక్ వసతి గృహంలో విద్యార్థులు అసౌకర్యాలతో సతమతమవుతున్నారు. వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో స్లాబ్ పెచ్చులూడి ఎప్పుడు మీద పడతాయోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మూడేళ్ల క్రితం నీటి పథకం మరమ్మతులకు గురవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు, బట్టలు ఉతుక్కోవటానికి, వంటకు ఇబ్బంది పడుతున్నారు. నీటి సదుపాయం లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. బకెట్‌తో నీళ్లు తీసుకుని మరుగుదొడ్లను ఉపయోగిస్తే ట్యాంక్ అవుట్ లెట్ లేక మరుగుదొడ్ల నీటితో కూడిన పిట్ నిండి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఈ వసతి గృహం ప్రహరీ హుదూద్ తుఫాన్ సమయంలో ఒక పక్క కూలిపోవడం వసతి గృహం చుట్టు పక్కల పొలాలు ఉండటం, చెట్లు పొదలతో నిండి ఉండటం వల్ల వసతి గృహ భవనంలోకి విష సర్పాలు ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వీటితోపాటు పందులు యధేచ్ఛగా సంచరిస్తున్నాయని ఇవి మలమూత్రాలను విసర్జించి దుర్గంధం వెదజల్లుతున్నాయని ఫలితంగా వ్యాధుల బారిన పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

శిథిలమైన వసతి గృహం పిల్లర్

ప్రభుత్వం మెస్ బిల్లులు చెల్లించటం లేదు

వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. సుమారు 6 నెలల నుండి ప్రభుత్వం మెస్ బిల్లులు చెల్లించటం లేదు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థుల స్నానాలకు వేడి నీళ్లను అందించే సోలార్ ప్లాంట్ పూర్తిగా పాడైంది. కాంపౌండ్ వాల్ కొంతమేర కూలిపోయింది. బాత్రూం రన్నింగ్ వాటర్ లేదు. లేవట్రీ ట్యాంకకు వచ్చే పైపులు శిథిలమయ్యాయి. వేస్ట్ వాటర్ అవుట్ ఫుట్ లేదు. స్లాపు సీలింగ్ కూడా కొన్ని చోట్ల పెచ్చులుడుతున్నాయి. పైన ఫ్లోరింగ్ కూడా పెట్టించాలి. వీటన్నింటి నిర్మాణాల కోసం ఇష్టమేసన్ వేసి పంపించాం కానీ నిధులు మంజూరు కాలేదు.

ఎస్. సత్యనారాయణ రెడ్డి, వసతి గృహం వార్డెన్.

మాజీ సర్పంచ్ చెరలో ప్రభుత్వ భూమి

ప్రజాశక్తి - జామి

గ్రామానికి, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు భక్షులుగా మారారు. అందులోనూ ప్రభుత్వ భూములు హాంఫట్ చేయడంలో వీరు సిద్ధహస్తులు అనడంలో ఎటువంటి సందేహం లేదు. తాజాగా బీమసింగి గ్రామంలో గ్రామస్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ప్రభుత్వ భూమిని ఆ గ్రామ మాజీ సర్పంచ్ కబ్జాకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన సత్తిరాజు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బీమసింగి గ్రామంలో గత కొంతకాలంగా భూ ఆక్రమణలు పై అనేక ఉదాంతాలు బయటపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మాజీ సర్పంచ్ భూ ఆక్రమణ వెలుగు చూసింది. గ్రామంలోని సర్వే నెంబర్ 108లో 66 సెంట్లు భూమిని ఆక్రమించి, రియల్ ఎస్టేట్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. వాస్తవానికి ఈ భూమిలో గ్రామ దేవత జాతర నిర్వహించుకునే వారమని గ్రామస్తులు అంటున్నారు. దీంతో పాటు గ్రామ కంఠాన్ని ఆక్రమించారని చెబుతున్నారు. తాజాగా ఈ భూ ఆక్రమణ వెలుగు చూడడం మరో సారి కలకలం రేపుతోంది. దీనిపై రెవెన్యూ అధికారులు ఏమేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. అయితే ఈ విషయంపై తహశీల్దార్ హేమంత్‌కువర్‌ను వివరణ కోరగా కబ్జాపై ఫిర్యాదు అందిందని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తహశీల్దార్‌కు ఫిర్యాదు

కబ్జాకు గురైన స్థలం ఇదే..

అభివృద్ధి చూసి ఆదరించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి పాలనలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఆదరించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు కోరారు. సోమవారం రామతీర్థం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో పర్యటించి సంక్షేమ పథకాలు అమలు, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమళ్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం, పతివాడ సత్య నారాయణ, సర్పంచ్ కంచ రావు సూర్య కళ, మాజీ సర్పంచ్ కంచ రావు రాము, తహసీల్దార్ కె.వి.రమణ రాజు, ఎంపిడిఒ జి. గిరిబాల, ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీ రావు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే కడబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బుద్ద చిన్నమ్మలు నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎంపిటిసి టీవీ రమణ, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, ఎఎంసి ఛైర్‌పర్సన్ కస్తూరి, నెట్ కేఫ్ డైరెక్టర్ పద్మావతి, పంచాయతీ రాజ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ ఎం సత్యనారాయణ, వైస్ ఎంపిపి అడపా ఈశ్వర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జగ్గు బాబు, జెసిఎస్ కన్వీనర్ భోజంకి శ్రీను, మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, సర్పంచులు పాల్గొన్నారు.

శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి: డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రిటైర్మెంట్ అనంతరం ఉద్యోగులు శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం జరజాపుపేట వెంకట మురళీ కృష్ణ కల్యాణ మండపంలో తహశీల్దార్ కంకిపాటి వెంకట రమణరాజు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన, సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు హాజరయ్యారు. అనంతరం జరిగిన సత్కార సభలో డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ తహశీల్దారు రమణ రాజు తన సర్వీస్ కాలంలో ఎన్నో ఒడిదుడుకలను ఎదుర్కొని సేవలు అందించారని కొనియాడారు. రమణ రాజు ఆర్ఐ, డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దారుగా ఎదిగి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయడం ఒకింత బాధ ఉన్నప్పటికీ కుటుంబంతో కలిసి ప్రశాంతంగా జీవించాలని కోరారు. కాగా రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శిగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేశారన్నారు. సేవా కార్యక్రమాలు ద్వారా ప్రజలతో తన బంధాన్ని పటిష్టం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్య నారాయణ, నగర పంచాయతి ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, నాయకులు మత్స సత్య నారాయణ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే

16మంది దాతలు స్వచ్ఛంద రక్తదానం

నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో 16మంది దాతలు స్వచ్ఛంద రక్తదానం చేశారు. సోమవారం తహశీల్దారు రమణ రాజు ఉద్యోగ విరమణ సందర్భంగా సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి 16మంది దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాష్ సొసైటీ ప్రతినిధులు కె ఆర్ డి ప్రసాద్, పోలుబోతు దుర్గా ప్రసాద్, సాధన యువజన సంఘం ప్రతినిధులు పసు మర్తి వెంకట రమణ, బి.వెంకట్రావు, టి. అశోక్ పాల్గొన్నారు.

శిథిల భవనం పరిశీలన

వేపాడ : మండలంలోని ఎఎస్‌పేట, గుడివాడ గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ గుడివాడ పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్తగా నిర్మించిన భవనంలో చదువుతున్న విద్యార్థులను శిథిలమైన పాత భవనం వైపు వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూ సక్రమంగా అందుతున్నది లేనిది రికార్డులను పరిశీలించారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - కొత్తవలస

విజయవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది ఆదిశేషు వైటల్ బాబు దారుణ హత్యకు వ్యతిరేకంగా కొత్తవలస బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. కొత్తవలస బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ గిరిబాబు మాట్లాడుతూ న్యాయవాదిని హత్య చేయడం హేయమైన చర్యని అన్నారు. దీనికి నిరసనగా కోర్టు పనికి దూరంగా ఉండాలని తమ సంస్థ ఎగ్జిక్యూటివ్ బాడీ నిర్ణయం తీసుకుందన్నారు. సంఘ విద్రోహులు చేసిన ఈ హేయమైన చర్య న్యాయవాద వృత్తిని తీవ్రంగా ప్రభావితం చేసిందన్నారు. ఈ సంతాప సమయంలో సంఘీభావంగా ఉండి, తమ సహకారాన్ని అందించడానికి తామంతా కలిసి, గళాన్ని వినిపించి, తోటి న్యాయవాదికి జరిగిన అన్యాయంపై నిరసన తెలియచేస్తున్నా మన్నారు.

విద్యుత్తు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విద్యుత్ ఉద్యోగులు సోమవారం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఏ.శంకరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 1999 ఫిబ్రవరి ఒకటి నుంచి 2004 ఆగస్టు 31 మధ్యలో రిక్రూట్ అయిన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కిమ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఏ విడుదల చేయాలని, పిఆర్సీ అమలు చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్స్ పై ఆధారపడి వారికి అన్ లిమిటెడ్‌గా వైద్య సౌకర్యం కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలని కోరారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై దశలవారీగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు లక్ష్మణ, దేవుడు, జయరాజు, సాంబశివరావు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తనిఖీకి సహకరించండి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీకి ఆయా పంచాయతీ ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపిపి శంబంగి లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఆమె సోమవారం సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మంగళవారం నుంచి వచ్చే నెల 13వ తేది వరకు సామాజిక తనిఖీ నిర్వహిస్తారన్నారు. 2022-23లో జరిగిన పనులకు సంబంధించిన లెక్కలు సంబంధిత అధికారులు సోషల్ అడిట్ అధికారులకు సమర్పించాలన్నారు. ఆడిట్‌కు సంబంధించి ఇప్పటికే సంబంధిత రికార్డ్లు ఉపాధి సిబ్బంది ఇవ్వాల్సి ఉన్నా ఇంకా ఇవ్వలేదని ఎస్ఆర్పి తెలిపారు. ఈ సమావేశంలో మండల వైసిపి అధ్యక్షులు సంబంగి వేణుగోపాల్ నాయుడు, ఎంపిడిఒ రవికుమార్, జెడ్‌పిటిసి శాంతి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

జమ్ముపేటలో పొలంబడి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని జమ్ముపేటలో సోమవారం సేంద్రియ వ్యవసాయం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రీజనల్ అధికారి రైతులు ఏ విధంగా ఖరీఫ్ సమయంలో వరిలో ప్రకృతి వ్యవసాయం చేయాలో సూచించారు. గట్ల చుట్టూ ఏ విధమైన పంటలు వేయాలో, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా రైతులతో సేంద్రియ వ్యవసాయం ఎలా చేయించాలో సూచనలు చేశారు. ఐసిఆర్పిలు విధులను సక్రమంగా నిర్వహించి ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని, ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ బాలి సత్యనారాయణ, చీపురుపల్లి, గరివిడి మండలాల ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు సర్వే పరిశీలన

భోగాపురం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని తహశీల్దార్ చింత బంగారురాజు సోమవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వారీగా పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫారం6, 7, 8 సమాచారాన్ని సక్రమంగా వివరించాలని చెప్పారు. కుటుంబం మొత్తం ఓట్లు ఒకే చోట ఉండేలా చూసుకోవాలని, తప్పులు తడకలు లేకుండా ఓటర్ లిస్ట్‌ను పూర్తిగా సరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, బిఎల్వోలు పాల్గొన్నారు.

కండ్ల కలకపై అవగాహన

నెల్లిమర్ల: కండ్ల కలక వచ్చినపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి కోరారు. సోమవారం సాయంత్రం కండ్ల కలకలపై అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి అవగాహన కార్యక్రమం చేపట్టారు. కండ్ల కలక ఎందుకు వస్తుంది? ఏయే రకాల జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కళ్ళ కలక వచ్చినవారు తమ కళ్ళను నలపకూడదని, కళ్ళపై వత్తిడి చేయరాదని తెలిపారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ దినేష్, విభాగాధిపతి శ్రావణి, ఈశ్వర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కోలగట్ల ఆరా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోనిగాజులరేగ పరిధి గుబేల్‌పేటలో జరిగిన గడప గడపకూ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. స్థానికంగా నెలకొన్న వీధి దీపాలు ఏర్పాటు విషయమై తక్షణమే స్పందించిన ఆయన లైట్లు ఏర్పాటు చేయాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. అలాగే సిసి రహదారి సౌకర్యాన్ని కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, మాన్యాల కృష్ణ, కణుగుల రాజా, పిఎసిఎస్ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు. 42వ డివిజన్లో రూ.36 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. కంటోన్మెంట్ మరియు శాంతినగర్లలో రహదారులు, కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి డాక్టర్ వివిఎస్ ప్రసాద్ కార్పొరేటర్ పిన్నింటి కళావతి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సమాచార హక్కు చట్టం జిల్లా సమన్వయ కమిటీ మెంబర్ దొడ్డి సూర్యారావు అధికారులను డిమాండ్ చేశారు. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో గల ఎంపిడిఒ, వెలుగు, ఉపాధి, ఐసిడిఎస్ కార్యాలయాలలో అధికారులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వచ్చి 18 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సమాచార హక్కు చట్టం అమలతీరును పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు సాంబమూర్తి,రామకృష్ణ, ఆర్. దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

కార్యదర్శిపై విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - డెంకాడ

ప్రజలపట్ల దురుసుగా వ్యవహరిస్తున్న సచివాలయ కార్యదర్శి వసుంధరాదేవిపై సోమవారం విచారణ చేపట్టారు. గత నెల 29న 'ఈ కార్యదర్శి మాకొద్దు' అన్న శీర్షికతో ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్పందించిన అధికారులు డిఎల్‌పిఒ మోహన్‌రావును విచారణ అధికారిగా నియమించారు. దీంతో ఆయన సింగవరం సచివాలయాన్ని సోమవారం పరిశీలించారు. కార్యదర్శి వసుంధర దేవిని ప్రజాశక్తిలో వచ్చిన వార్తపై వివరణ అడిగారు. పత్రికలో వచ్చిన ప్రతి విషయాన్ని కూలంకుసంగా, లిఖిత పూర్వకంగా రాసి తీసుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. అయితే కార్యదర్శి మాత్రం ఎంపిడిఒపై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. డిఎల్‌పిఒ మోహన్‌రావు గ్రామస్తులు ఎవరినీ విచారణ చేయకుండా సచివాలయంలో కార్యదర్శి వసుంధర దేవి స్టేట్ మెంట్‌ని తీసుకొని వెళ్ళిపోవడాన్ని పలువురు తప్పు బడుతున్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
I.P: 5/2023

Between:
Gedala Ramu, S/o. Late Butchayya, Ex- Employee in jute mill, Resident of D.No:8-31-255, Gedda Veedhi, Thotapalem, Vizianagaram. ......Petitioner
And:
1. Pulgam Lakshmi, W/o. Late Pulagam Venkata Krishna Reddy, Resident of Door No: 1-82, Devangula Street, Ramavaram, Anaparthy Mandal, East Godavari District.
2. PulahamVeera Venkata KodandaRama Reddy, S/o. Late Venkata Krishna Reddy, - rest ditto -
3. NallamilliGowthami, W/o. Siva Reddy, - rest ditto -
4. Chilla Vasu, S/o. Chilla Appa Rao, r/o Near 2nd Rama Mandiram, Lanka Veedhi, Vizianagaram.
5. Madeva Pydi Raju, S/o. Ramu, r/o of Gedda Veedhi, Thotapalem, Vizianagaram.
6. Pathivada Bhaskara Rao, S/o.Ramu Naidu, r/o Near M.L.A Kallalu, Kumili, Poospatirega Mandal, Vizianagaram district.
7. Pativada Lakshmi, W/o. Jagan, r/o near three temples, Drivers colony, Kommadi Junction, Vizianagaram. .....Respondents

NOTICE

పై నెంబర్ ఐపి 5/2023లో పిటిషనర్ ఇందలి రెస్పాండెంట్లు వద్ద నుండి ఋణములు తీసుకుని దరిమిలా ఋణములను తీర్చలేక దివాలా తీసినందున అందుకు పిటిషనరు ఇన్‌సాల్వెంట్ పర్సన్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ దాఖలు చేసిన పై వాజ్యము తే 9-8-2023దికి వాయిదా వేసి వున్నది. కావున అందుకు ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలున్న ఎడల పై కోర్టు ఎదుట **తే 9-8-2023దిన ఉదయం 10-30 గం॥ల**కు హాజరు అయివారి ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమంగా కోర్టు తీర్మాణం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

//బై కోర్టు ఆర్డర్//

P.Dhananjaya Rao
Advocate for Petitioner,
Vizianagaram, Cell: 9440711430

మహారాజశ్రీ విజయనగరం జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P 21/2023

Between:
Chelluri Ramesh Babu, S/o late Satya Rao, 2nd lane Suryanagar, Near M.R.College Stadium, Vizianagaram. ....Petitioner
And:
Nil .....Respondents

GENERAL NOTICE TO PUBLIC

యిందు మూలంగా యావన్మందికి తెలియజేయుదేమనగా పై కేసులో పిటిషనరు అతని మేనల్లుడులైన కంచుమోజు నాగేంద్ర చరణ్, కంచుమోజు నాగ చైతన్యలకు గార్డియన్‌గా నియమించమని కోరుచూ దాఖలు చేసిన కేసు తే 22-8-2023దీకి వాయిదా వున్నది. పై పిటిషన్‌లో ఎవరికైనా ఆక్షేపణలున్న ఎడల **తే 22-8-2023దీన ఉదయం 10-30 గం॥**లకు హాజరై పై కోర్టువారి ఎదుట మనవి దాఖలు చేసుకొనవలెను. లేనిచో సదరు పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించడమగును.

//బై కోర్టు ఆర్డర్//

N. Nageswara Rao
Advocate for Petitioner,
Vizianagaram,
Cell: 9440762184

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM.
I.P. 7/2023

Between :
Rongali Suribabu S/o (Late) Simhachalam, Hindu, aged 55 years, residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District. ....Petitioner
And :
1. Chelluri Sathibabu @ Satya Narayana, son of Late Ramu, Hindu, aged about 42 years, residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District.
2. Nirujogi Sathibabu S/o Sreeramulu Hindu, Aged about 43 years, residing at Singarvi Village, Vepada Mandal, Vizianagaram District.
3. Kotana Ramanamma W/o Yerrinaidu (Late) Hindu, aged about 50 years, residing at residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District.
4. Gorripati Venkata Prasad, s/o Appalanaidu, Hindu, aged about 57 years, residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District.
5. Yedla Avantharam son of Demudu, Hindu, aged about 48 years, residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District.
6. Reddi Appa Rao, son of not Known, Hindu, aged about 58 years, S.Kota Village, S.Kota Mandal, Vizianagaram District.
7. Kurakula Jagga Rao, Son of not known, Hindu, aged about 55 years residing at Santhapeta Jn. L.Kota Village, L.Kota Mandal, Vizianagaram District.
8. Pasupureddy Appannadora, Son of Sinnibabu, Hindu, aged about 50 years, residing Santhapeta Jn. L.Kota Village, L.Kota Mandal, Vizianagaram District.
9. Yeddla Mahesh, son of Ramunaidu, Hindu, aged about 45 years, residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District.
10. Gedala Satyam, Son of Appalanaidu, Hindu, aged about 60 years, residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District.
11. Gorripotu Sanyasi Appala Naidu, Son of Simhachalam (Late) Hindu, aged about 59 years, residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District.
12. Kamaku Venkatarao, Son of Ramu, Hindu, aged about 48 years, residing at Chanduluru Village, L.Kota Mandal, Vizianagaram District.

GENERAL NOTICE

The petitioner field the above I.P. for declaration of insolvency have he became indigent for discharge of debts contracted by him with the creditors 12 in number.

The Hon'ble court has been pleased to order the General notice to whom so ever it may concern to appear either in person or through an Advocate on **08-08-2023 at 10-30 am** for raising objections if any in the above matter otherwise the matter will be heard expert.

G.SATYAM
Advocate for Petitioner,
Cell No. 6281470208